


# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

క్రైస్తవ మాసపత్రిక

MAY - 2009

సంవత్సర చందా రూ. 50/-

# ప్రకటన గ్రంథ వ్యాఖ్యానము

సత్యవాక్కులో గత 34 మాసములుగా (2006 ఆగస్టు నుండి 2009 మే నెలవరకు) ప్రకటన గ్రంథ ప్రసంగమాలికను ప్రచురించుచు వచ్చాము. ప్రకటన గ్రంథములోని 22 అధ్యాయాలు అందు చక్కగా వివరించబడి యున్నవి.

జాషువా గూటం గారు ఈ గ్రంథముపై క్రీస్తు సంఘములో అమెరికాలో యున్న అనేక బైబిలు పండితులు వ్రాసిన వ్యాఖ్యానములు చదివి, వాటిని క్రోడీకరించి ఆంధ్రలో యున్న బోధకులు తమ స్థానిక సంఘములకు ఉపదేశించుటకు వీలుగా యుండునట్లు ఈ ప్రసంగ మాలికలను తయారుచేసి ప్రచురిస్తు వచ్చారు. ఇప్పుడవన్నీ ఒక పుస్తక రూపమున ముద్రించాలని అనేకులు ఉత్తరాలు ద్వారా , ఫోన్ల ద్వారా తెలియజేయుచున్నారు గాన వారి కోరిక మేరకు విశ్వాసముతో ఆపనిలో నిమగ్నులమైయున్నాము. అది గ్రంథ రూపములో ఇంకొక రెండు మాసములలో లభించగలదు. ఒక్కొక్క కాపీ కనీసం 60-రూ॥లు కావచ్చును. గనుక దానికొరకు వేచి యుండండి, దానిమూల్యమును సేకరించుకొనండి. ప్రకటన గ్రంథ ప్రసంగ మాలిక సిద్ధమవగానే మీకు తెలియజేయుదుము. అప్పుడు మీరు డబ్బు పంపించి, మీ కాపీని పొంద వచ్చును.

– ఎడిటర్

# సత్యవాక్యం
# THE WORD OF TRUTH


P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**


*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 29 | మే 2009 | సంచిక -10


## క్రీస్తుద్వారా దేవుడు దీవించును
(God gives Blessings Through Christ)

మానవుడు పాపము చేయగా దేవుడొక రక్షకుని వాగ్దానము చేసారు. ఆయన స్త్రీ సంతానమని ఆయన చెప్పారు. వాగ్దానము చేయబడిన స్త్రీ సంతానమే యేసుక్రీస్తు. ఆయన దేవుడై యుండియు మనుష్యరూపము ధరించి ఈ లోకమునకు వచ్చెను. మానవుల పాపముల కొరకు సిలువపై చనిపోయెను, సమాధిచేయబడెను. అయితే మూడవ దినమున సమాధిని, మరణమును జయించి ఆయన తిరిగి లేచెను. తద్వారా మరణము యొక్క బలము గల వానిని, అనగా అపవాదిని ఆయన ఓడించెను. వాని తల చితుక గొట్టెను. ఇప్పుడాయన పరమందున్న తండ్రియైన దేవుని కుడి పార్శ్వమున కూర్చొని మనకొరకు విజ్ఞాపన చేయుచున్నారు.

మానవులందరు యేసుక్రీస్తు ద్వారా ఆశీర్వదించబడునట్లు దేవుడాయనను ఈ లోకములోనికి పంపెను. ఇప్పుడు మనము ఆశీర్వదించ బడాలంటే క్రీస్తులో యుండాలి. ఏలయనగా సమస్త ఆత్మీయాశీర్వాదములు క్రీస్తులోనే దాచబడి

యున్నాయి. ఎఫెసీ 1:3-7లో ఇట్లు వ్రాయబడి యున్నది:

"మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక. ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదము మనకనుగ్రహించెను. ఎట్లనగా..... యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై మనలను ముందుగా తనకోసము నిర్ణయించుకొని... జగత్తు పునాది వేయబడక మునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను. దేవుని కృపామహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియుని యందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ కలిగి యున్నది".

ప్రతి విధమైన ఆత్మీయ ఆశీర్వాదము క్రీస్తుతో యున్నది అన్నప్పుడు క్రీస్తుకును, ఆయనలో యున్నవానికిని గల ప్రత్యేక సంబంధము తెలియనగుచున్నది. ఎవరైతే ఈ లోకములో నుండి క్రీస్తు కొరకు సువార్త ద్వారా పిలువబడిరో అట్టివారికి క్రీస్తు రాజైయున్నారు; అట్టివారికి ఆయన శిరస్సైయున్నాడు. "ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు, ఆయనే శిరస్సు" (కొలస్స 1:17-18). శరీరమునకు ఆయన శిరస్సు అన్నప్పుడు దానిని కంట్రోలు చేయువాడు ఆయనే యని యిష్ట పూర్వకముగా ఆయన చిత్తానికి లోబడుట ద్వారా ఆయన సంఘాన్ని నిర్మించుచున్నారు, తన అధీనములో ఉంచుకొని యున్నారు.

క్రీస్తులో యున్నవారికి ఆయన ప్రతి విధమైన ఆత్మీయ ఆశీర్వాదము అనుగ్రహించును (ఎఫెసీ 1:3). ఆయనలో యుంటే మన పాపములకు విమోచన, మన అపరాధములకు క్షమాపణ లభించును (ఎఫెసీ 1:7). ఆయనలో యున్నవారు పరిశుద్ధులుగా యుందురు (1కొరింథీ 1:2). మరియు క్రీస్తుయేసునందున్న వారికి ఏ శిక్షావిధియు ఉండదు (రోమా 8:1). "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింథీ 5:17). క్రీస్తులో యున్నవానికి నూతన స్వభావము అనుగ్రహించబడును. అతని పాత స్వభావము మార్చబడును. మరియు క్రీస్తులో యున్నవానికి ఆయన నిత్యజీవము నిచ్చును. "దేవుడు మనకు నిత్యజీవమును దయచేసెను, ఈ జీవము ఆయన కుమారుని యందున్నది" (1యోహాను 5:11). మరియు క్రీస్తుయేసునందున్న వారు రక్షణ పొందుదురు (2తిమోతి 2:10).

గనుక ఒకడు క్రీస్తు యేసునందు న్నప్పుడు, యేసుతో అతనికొక ఆత్మీయ సంబంధమున్నది. క్రీస్తుయేసునకు వెలుపల ఏ విధమైన ఆత్మీయ ఆశీర్వాదములేదు, ఒకడు పాపముల నుండి రక్షింపబడాలంటే అతడు క్రీస్తులో యుండాలి.

క్రీస్తులో యున్నవాని పాపములు క్షమింపబడతాయి. మానవుడు యేసుక్రీస్తు నందు విశ్వాసియై, పాపముల విషయమై మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినప్పుడు, అతని గత పాపములన్నిటిని దేవుడు క్షమించును, గనుక ఒకడు క్రీస్తులో యున్నప్పుడు యేసుక్రీస్తు యొక్క రక్తమువలన విమోచింపబడిన వాడగును. అంటే తన పాపములనుండి క్రీస్తు యొక్క రక్తపు విలువ నిచ్చికొనబడిన వాడగును. అందుకే "మీరు మీ సొత్తుకారు, విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమ పరచుడి" యని అపొ.పౌలు చెప్పాడు (1 కొరింథీ 6:20).

ఒకడు విమోచింపబడి, క్రీస్తు రక్తము ద్వారా కడుగబడి నప్పుడతడు నూతన సృష్టియగును; క్రీస్తునందు న్నవారు ఆయన రక్తము వలన కడుగబడిన వారు గనుక పరిశుద్ధులు. అందువలన క్రీస్తుయేసునందున్నన వారికి నిత్యజీవ నిరీక్షణ యున్నది. అవిశ్వాసులు, అవిధేయులైన లోక స్థులవలె వారు ఏ శిక్షావిధికి గురియైన వారు కారు. క్రీస్తులో క్రైస్తవులు ప్రత్యేకింపబడిన వారు. వారికి రక్షణ యున్నది. నేను రక్షింపబడిన వానినని ఒకడు తెలిసికొనుట మంచి అనుభవము. ఇట్టి అనుభవము క్రీస్తునకు వెలుపల యున్న వారికేమియు ఉండదు. అందువలన ఒకడు క్రీస్తులో యుండుట అతి ప్రాముఖ్యము.

సహజంగా ఇప్పుడు మనకు వచ్చే ప్రశ్నయేమంటే ఒకడు క్రీస్తులోనికి ఎట్లు ప్రవేశించును ? అనేది. అపొ. పౌలు ఇట్లనుచున్నాడు: "యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు. "మీరు క్రీస్తుసంబంధులైతే ఆపక్షమందు అబ్రాహాము యొక్క సంతానమై యుండి వాగ్దాన ప్రకారము వారసులై యున్నారు" (గలతీ 3:26-29).

మరల, "క్రీస్తుయేసు లోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము

పొందితిమని మీరెరుగరా?" యని రోమా 6:3లో పౌలు అడుగుచున్నాడు.

బాప్తిస్మము పొందుట ద్వారా మనము క్రీస్తులో ప్రవేశిస్తాము. బాప్తిస్మము అనగా నీటిలో ముంచబడుట. క్రీస్తు ఏలాగైతే సమాధి చేయబడెనో, మనము నీటిలో ఆలాగ సమాధి చేయబడి తిరిగి లేవాలి. అప్పుడు ఆయన కుమారుని రక్తము వలన ఆ నీటి బాప్తిస్మములో మన ప్రతి పాపమును కడిగివేసి, క్షమించి, రక్షించి ఆయన మనలను తన సంఘముతో చేర్చుకొంటారు. నీవు క్రీస్తులో యున్నావా?

# నిశ్చయించుకొనుట యందు నీవు నమ్మవుగదా

## (So You don't believe in Pledging)

"సణుగు కొనకయు బలవంతముగా కాకయు ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను. దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును" (2 కొరింథీ 6:7).

ఒకడు తన హృదయములో నిశ్చయించుకొంటేనే గాని ఎవడును ఇయ్యలేదని బైబిలు బట్టి మనం గ్రహించుకొనవచ్చును. ఒకవేళ ఇచ్చుటకు నిరాకరించినా అదికూడ హృదయములో నిశ్చయించు కొనడం ఒక సున్నితమైన అంశము. డబ్బు గురించి మాట్లాడే సరికి ప్రజలు ఇబ్బంది పడ్తారు. "ఎందుకనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము. కొందరు దానిని ఆశించి విశ్వాసము నుండి తొలగి పోయి నానాబాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి" యని పౌలు చెప్పాడు (1 తిమో 6:10).

ఒకడు తన క్షేమము కొరకు వాగ్దానము చేసి దానిని నెరవేర్చు కొనకపోతే అతడు యోగ్యమైన వాడెట్లవుతాడు? నిజం చెప్పాలంటే మనలో ఎవడు తన డబ్బు కంటే యేసును ఎక్కువ ప్రేమించుటలేదు. ధనవంతుడైన యువకుడు దుఃఖపడుచు వెళ్లిపోయెను. అతడు దేవునికంటె తన ధనాన్ని ఎక్కువ ప్రేమించాడు. హృదయములో నిశ్చయించు కొనుట అంటే దేనినైనా ఒకటి చేయుటకు హృదయ పూర్వకముగా నిర్ణయించుకొనుట యని అర్థము.

**నిశ్చయించు కొనుటకు లేఖనాధికారము :**

"రాజు భుజించు ఆహారమును పానముచేయు ద్రాక్షారసమును పుచ్చుకొని తన్ను అపవిత్ర పరచుకొనకూడదని దానియేలు ఉద్దేశించి తాను అపవిత్రుడు కాకుండునట్లు వాటిని పుచ్చుకొనకుండ సెలవిమ్మని" దానియేలు రాజు యొక్క అధిపతిని అడిగెను (దానియేలు 1:8). దానియేలు యొక్క నిర్ణయం తప్పని ఎవరైన చెప్పగలరా?

"ఈలాగు జరిగిన తరువాత పౌలు మాసిదోనియ అకయ దేశముల మార్గమున వచ్చి యెరూషలేమునకు వెళ్లవలెనని మనస్సులో ఉద్దేంచి నేనక్కడికి వెళ్లిన తరువాత రోమా కూడ చూడవలెనని అనుకొనెను" (అపో.కా. 19:21).

"సహోదరులారా, .... అనేక పర్యాయములు మీ యొద్దకు రానుద్దేశించితిని గాని యిది వరకు ఆటంకపరచబడితిని" (రోమా 1:14).

"తూర్పునుండి క్రూర పక్షిని రప్పించుచున్నాను. దూరదేశమునుండి నేను యోచించిన కార్యమును నెరవేర్చెదను. ఉద్దేశించియున్నాను సఫల పరచెదను" (యెషయా 46:11).

"సణుగుకొనకయు బలవంతముగా కాకయు ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను. దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును"(2 కొరి 9:7). ఈ వచనమును చదివిన తరువాత కానుకల నిచ్చుటలో నిశ్చయత, నిర్ణయము వుండవలసినదని అందరు అంగీకరించెదరు.

ఎంత ఇయ్యాలో నేను ముందుగా నిర్ణయించుకొనను అని కొందరు చెబుతారు. ఎందుకు నిశ్చయించుకొనరు? బైబిలు అట్లు చెప్పుచున్నదికదా. బాప్తిస్మము పాప క్షమాపణకొరకని బైబిలు ఎట్లు చెప్పుచున్నదో ప్రతివాడు తన హృదయములో నిశ్చయించుకొని ఇయ్యాలని కూడ అది చెప్పుచున్నది. "నీ పెదవులనుండి బయలు దేరిన మాటను నెరవేర్చుకొని నీ దేవుడైన యెహోవాకు మ్రొక్కు కొనిన ప్రకారము నీవు నీ నోట పలికినట్లు స్వేచ్ఛార్పణము అర్పించవలెను" (ద్వితీ 23:23).

యూదులు తమ స్వేచ్ఛార్పణములను సయితము మ్రొక్కుకొనిరి. అంటే ముందుగానే నిశ్చయించుకొనిరి. ఆదికాండము 28:20-22లో యాకోబు దేవుడు తనకిచ్చిన యావత్తులో పదియవవంతు నిశ్చయముగా దేవునికి చెల్లించెదనని మ్రొక్కుకొనెను.

**నిశ్చయించు కొనినందున క్రమముగా ఇచ్చుటకు వీలుపడును :**

ఇచ్చుట క్రైస్తవ జీవితములో ఒక భాగము. దేవుడు మనలను ఎంతో

ప్రేమించి తన కుమారుని యిచ్చెను (యోహాను 3:16). మనం ప్రభువుని ప్రేమించిన యెడల ఆయన పని నిమిత్తము ధారాళముగా ఇయ్యవచ్చును. అది సహజము. మనం హృదయములో నిశ్చయించుకొన్న కొలది దేవుని పనికై ఇచ్చుట ఉత్తమము.

నిశ్చయించుకొనడంలో తప్పులేదు. దీనికి ఎవరైనా ఎందుకు అభ్యంతరము చెబుతారు? కొందరు బహు స్వల్పముగానే యిస్తారు గనుక వారిచ్చేది ఎవరికీ తెలియకూడదనుకొంటారు. ఎవరైతే నిశ్చయతతో యిస్తారో వారు క్రమముగా కూడ యిస్తారు.

**ఒకడు యిచ్చుటకు నిశ్చయించు కొనాలి:**

నిశ్చయించుకొనకుండా ఎవడు ఇయ్యలేడు. "ప్రతి వాడును తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను" (2 కొరింథీ 9:7). ఎవడైనా ఒక రూపాయి ఇయ్యకుండా యుంటే, ఇయ్యకూడదని తన హృదయములో నిశ్చయించు కొన్నాడన్నమాట. ఇచ్చుటను గూర్చి కూడ ఒకడు తన హృదయములో నిశ్చయించుకొనాలి.

నా ఆదాయములో కొంత భాగమునయినా నేను ఇయ్యకూడదని నిశ్చయించుకొంటే, ఆ డబ్బును నాస్వీయ ప్రయోజనాలకు వాడుకుంటే, నా నిశ్చయతను ముందుగానే తెలియజేయుటకు ఇష్టపడను. మనుష్యుడు వాగ్దానం చేయడానికి, నిశ్చయించుకొనడానికి వ్యతిరేకుడు కాదు. ఏలయనగా పలు సందర్భాలలో అతడు వాగ్దానాలు చేస్తాడు.

దేవుని పని విషయంలో తన ఆధాయాన్ని మరింత ఎక్కువ పరించాలి. హృదయంలో కొంత కేటాయించడానికి నిరాకరించు వాడు బైబిలు గ్రంథాన్ని నిశ్చయించుకొంటే దేవుని పని కొరకు ప్రణాళిక వేసి కొన్నట్లే యగును.

ఏస్థానిక సంఘమయినా తన ఆర్థిక వనరులనుగూర్చి క్రమబద్ధమైన ప్రణాళిక లేకుండా యుంటాదో అది త్వరలో క్షీణించిపోతాది. స్వేచ్ఛాపూర్వకంగా యిస్తానని నీవనుకొనవచ్చును. "నీ పెదవుల నుండి బయలు దేరిన మాటను నెరవేర్చుకొని నీ దేవుడైన యెహోవాకు మ్రొక్కుకొనిన ప్రకారము నీవు నీనోట పలికినట్లు స్వేచ్ఛార్పణము నర్పింపవలెను" (ద్వితీ 23:23). అపో. పౌలు ఇట్లు చెప్పాడు: "పరిశుద్ధుల కొరకైన యీ పరిచర్యను గూర్చి మీ పేరు వ్రాయుటకు నాకగత్యము లేదు. మీ మనస్సు సిద్ధమై యున్నదని నేనెరుగుదును. అందువలన సంవత్సరము నుండి అకయ సిద్ధపడియున్నదని చెప్పి నేను మిమ్మును గూర్చి మాసిదోనియ వారి యెదుట

అతిశయపడుచున్నాను. మీ ఆసక్తిని చూచి అనేకులు ప్రేరేపింపబడిరి. అయితే మిమ్మును గూర్చిన మా అతిశయము ఈ విషయములో వ్యర్థము కాకుండునట్లు నేను చెప్పిన ప్రకారము మీరు సిద్ధముగా ఉండుటకై యీ సహోదరులను పంపితిని. మీరు సిద్ధపడనియెడల ఒక వేళ మాసిదోనియా వారెవరైనను నాతో కూడ వచ్చి మీరు సిద్ధముగా ఉండకపోవుట చూచిన యెడల, ఈ నమ్మిక కలిగియున్నందున మేము సిగ్గుపరచబడుదుము. మీరును సిగ్గుపరచబడుదురని యిక చెప్పనేల ? కావున లోగడ ఇచ్చెదమని మీరు చెప్పిన ధర్మము పిసినితనముగా ఇయ్యక ధారాళముగా ఇయ్యవలెనని చెప్పి సహోదరులు మీ యొద్దకు ముందుగా వచ్చి దానిని జమ చేయుటకై వారిని హెచ్చరించుట అవసరమని తలంచితిని" (2 కొరింథీ 9:1-5).

మనం ముందుగా చేసిన నిశ్చయత యొక్క బయల్పాటుగా మనం ఇయ్యాలి. మనం యిచ్చేది సరిగా సంకల్పించుకోవాలి. క్రియలేని సంకల్పము వ్యర్థము, మరియు సంకల్పములేని క్రియ అసంపూర్ణము. సంకల్ప ప్రకారం యిస్తే అది సహోదరులకు ప్రోత్సాహకరం. మిగతా వారు కూడ ధారాళముగా ఇచ్చుటకది దోహదపడును. దేవుడు నిర్ణయించిన ప్రకారము క్రీస్తు సంఘస్థులందరు యిస్తే, ఈ లోకం అంతా అనతికాలంలోనే సువార్త చాటబడుతాది.

ఇచ్చుటను గూర్చి బైబిలు ఏమి చెప్పుచున్నదో దాన్ని గూర్చి చదవడానికి ఒకడు నిరాకరిస్తే, దాన్ని గూర్చి బైబిలు ఏమి చెప్పుచున్నదో చూచుటకు కండ్లు మూసికొంటే, తన మనస్సును ఉపదేశము కొరకు తెరిచియుంచకపోతే అతడు తన ఆత్మను కోల్పోవును. లోభియైన సభ్యుడు బోధకుని ఇచ్చుటను గూర్చి బోధించవద్దని భయపెడితే అదికూడ భయంకరమే. నీకు కావలసినదంతా సంపాదించుకొని దాచుకొన గోరినదంతా దాచుకొని, నీ శక్తి కొలది ఇయ్యకపోతే, నీవు రెట్టింపు నరకపాత్రుడ వగుదువు.

-V.P. బ్లేక్

# క్రీస్తు యొక్క వాగ్దానము

## (The Promise of Christ)

**పరిచయం :**

ఇటలీ దేశస్థుడైన మార్కో పోలో అనునతడు తూర్పు ఆసియా వైపు ప్రయాణం చేసి తిరిగి వచ్చి అక్కడి ప్రజలను గూర్చి అనేక సంగతులను తెలియ జేయగా ఇటలీ దేశస్థులు అతడు చెప్పుచున్న వన్నీ అవాస్తవములని ప్రకటించుమని అతనిని బలవంతము చేసారు, గాని "అక్కడున్న వాటిలో సగం కూడ చెప్పబడలేదు" అని అతడు జవాబిచ్చాడు.

సొలొమోను యొక్క ఘనతను గూర్చి విని షెబదేశపురాణి అతని దర్శించెను. ఆమె విస్మయ మొంది రాజైన సొలోమోనుతో ఇట్లనెను: "నీ కార్యములను గూర్చియు జ్ఞానమును గూర్చియు నా దేశమందు నేను వినిన మాట నిజమే; అయినను నేను కన్నులార చూడకమునుపు ఆ మాటలను నమ్మక యుంటిని; ఉన్నదానిలో సగమైనను నాతో చెప్పబడలేదని యిప్పుడు నేను తెలిసికొనుచున్నాను" (1 రాజులు 10:6-7).

"దేవుడు తన్ను ప్రేమించు వారికొరకు ఏవిసిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు, మనుష్యహృదయమునకు గోచరము కాలేదు" (1 కొరింధీ 2:9).

దేవుడు మన కొరకు ఏవి దాచియుంచెనో తెలిసికొనుటకు ప్రకటన 22:12-21 వరకు ఇప్పుడు ధ్యానింతము.

**1. క్రీస్తు యొక్క వాగ్దానము (22:12-13) :**

"ఇదిగో నేను త్వరగా వచ్చుచున్నాను. వాని క్రియల చొప్పున ప్రతివానికిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నా యొద్ద ఉన్నది".

క్రీస్తువారు త్వరగా వచ్చెదనని వాగ్దానము చేసారు. అంటే ఆయన అనుకొనని ఘడియలో అకస్మాత్తుగా వచ్చును (1 థెస్స 5:2). ఆయన వచ్చినప్పుడు ప్రతివానికి వానివాని క్రియల చొప్పున జీతమిచ్చును.

మన క్రియల చొప్పున మనకు ప్రతిఫలమియ్యబడునని ప్రకటన గ్రంధములోను, బైబిలు అంతటి లోను దేవుడు మనలను హెచ్చరించుచునే యున్నారు. మనం విశ్వాసము ద్వారా రక్షింపబడు

దుమని చెప్పబడింది; నిజమేగాని అది మృత విశ్వాసము కాదు. క్రియా రూపకమైన విశ్వాసమును బట్టి మనకు ఫలము లభించును (రోమా 2:6; 2 కొరి 5:10).

"నేనే అల్ఫాయు ఓమెగయు, మొదటి వాడను కడపటివాడను".

సమస్తము ఆయనతోనే ఆరంభమాయెను; సమస్తానికీ ఆయనే ఆదియు అంతమును. ఆయనే మన విశ్వాసమునకు కర్తయు, దాని కొనసాగించువాడును (హెబ్రీ 12:2). ఆయన పేరు యేసు క్రీస్తు. క్రొత్త నిబంధనలోని మొదటి వచనములోనే ఆయన పేరున్నది. ఆయన ఆశీర్వాద ముతో క్రొత్త నిబంధన అంతమగుచున్నది.

**II. చివరి ధన్యత : (22:14-15).**

"జీవ వృక్షమునకు హక్కు గలవారై గుమ్మములగుండా ఆ పట్టణములోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకుకొనువారు ధన్యులు".

దేవుని ప్రజలు ఆయన చిత్తమును జరిగించుచు యుండాలి. అననీయ సౌలుయొద్దకు వచ్చి సువార్తబోధించి, "నీవు తడవు చేయుట ఎందుకు ? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుము" అని చెప్పాడు (అపొకా. 22:16).

ఈ పాపపు వస్త్రములను ఉదుకు కొనుట బాప్తిస్మముతో అంతమైపోదు.

క్రైస్తవుడైన తరువాత నీతి క్రియలు అనే వస్త్రములను ధరించుకోవాలి. "మరియు ఆమె ధరించుకొనుటకు ప్రకాశములును నిర్మలములునైన సన్నపునార బట్టలు ఆమె కియ్యబడెను ; అవి పరిశుద్ధుల నీతి క్రియలు" (ప్రకట 3:4).

మహాశ్రమలలోనుండి విజేయులై వచ్చిన వారికి తెల్లని వస్త్రము లియ్యబడును (ప్రక 7:9).

తమ వస్త్రములను ఉదుకుకొనిన వారు ఏల ధన్యులు? ఏలయనగా వారు పరలోక ప్రవేశమునకు అర్హులు. వారు జీవ వృక్షఫలములను భుజించి నిత్యము జీవింతురు ! (ప్రక 2:7; ఆదికా. 3:22).

**III. వెలుపల యుండువారు:**

"కుక్కలును మాంత్రికులును, వ్యభిచారులును అబద్ధమును ప్రేమించి జరిగించు ప్రతివాడును వెలుపట నుందురు".

కుక్కలు అనగా మలినమైనవారు, అసహ్యులు అపవిత్రులు(1 రాజులు 21:19; ద్వితీ 23:17).

మాంత్రికులు, మేజిక్ చేయువారు, జోస్యము చెప్పువారు, దేవతార్చన చేయువారు (గలతీ 5:19-21).

వ్యభిచారులు, జారులు (1కొరింథీ 6:13).

తమ సహోదరులను ద్వేషించు వారు కూడ

నరహంతకుల జాబితాలోనివారే(1 యోహాను 3:15).

మానవ హస్తకృతములైన బొమ్మలు, వాటి పూజ విగ్రహారాధనయే, మరియు ధనాపేక్ష కూడ విగ్రహారాధన యే (కొలస్స 3:5).

అబద్ధములాడువారు, దానిని ప్రేమించు వారు దేవునికి అసహ్యులు (సామె 6:19).

**IV. దావీదు వేరు, చిగురు (22:16):**

యేసు దావీదు వేరు చిగురును సంతానమును, ప్రకాశమానమైన వేకువ చుక్కయునై యున్నారు.

యిది యెషయా 11:1లో ప్రవచింప బడింది: " యెష్షయి మొద్దునుండి చిగురు పుట్టును, వాని వేరులనుండి అంకురము ఎదిగి ఫలించును". దావీదు, క్రీస్తుకూడ యూదా వంశమునకు చెందిన వారు (హెబ్రీ 7:14;ఆదికా. 49:10).

క్రీస్తు ప్రకాశమానమైన వేకువచుక్కయై యున్నారు.

"నక్షత్రము యాకోబులో ఉదయించును. రాజదండము ఇశ్రాయేలు లోనుండి లేచును" అని ప్రవచింపబడింది (సంఖ్యా 24:17).

యేసుక్రీస్తు ఆ ప్రకాశమానమైన వేకువ చుక్క. క్రీస్తు ఈ లోకమునకు వెలుగై యున్నారు. ఆయనను వెంబడించువారు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగి యుందురు (యోహాను 8:12).

**V. చివరి ఆహ్వానము (22:17).**

"ఆత్మయు పెండ్లి కుమార్తెయు రమ్ము అని చెప్పుచున్నారు".

ఆత్మ అనగా పరిశుద్ధాత్మదేవుడు. వాక్యము ద్వారా ఆయన నేడు ఆహ్వానించు చున్నారు (యోహాను 16:8; అపొకా 2:21-37; 24:25).

పెండ్లి కుమార్తె అనగా సంఘము. క్రైస్తవులు, క్రీస్తు సంఘము క్రీస్తు యొక్క వధువు (రోమా 7:4; 2 కొరి 11:2; ఎఫెసీ 5:25-31).

సువార్త ద్వారా సంఘము అందరినీ ఆహ్వానించుచున్నది, ఇదిగో సమస్తము సిద్ధమైయున్నదని సంఘము ఆహ్వానించాలి (లూకా 14:17).

మనం వీధులలోనికి సందులోనికి, సర్వలోకానికివెళ్లి అందరినీ ప్రభువునొద్దకు ఆహ్వానించాలి (లూకా 14:21-23).

"విను వాడును రమ్ము అని చెప్పవలెను" ప్రతివాడు తన పాత్ర నిర్వహించాలి. ఏలయనగా మనలో ప్రతివాడు దేవునికి లెక్క యొప్పగించాలి (రోమా 14:12). ప్రతివాడు ఇంకొకనికి బోధించాలి (2 తిమోతి 2:2).

"దప్పిగొనిన వానిని రానిమ్ము"

నీతి కొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు వారు తృప్తి పరచబడుదురు అని యేసు చెప్పెను (మత్తయి 5:6).

మానవుని దాహము తీర్చుదునని ప్రకటన

గ్రంథములో పలుమారులు దేవుడు వాగ్దానం చేసారు.

"ఇచ్ఛయించు వానిని జీవజలమును ఉచితముగా పుచ్చుకొననిమ్ము".

జీవ జలము ఉచితమే అది దేవుని కృపా వరమే. దానిని పొందుటకు మానవుడు తనకుగా తాను యేమీ చేయలేడు. క్రీస్తు సిలువ మరణం ద్వారా అది ఉచితముగా ఇయ్యబడుచున్నది. దాని మూల్యమును క్రీస్తు మన కొరకు చెల్లించేసారు. అందు వలన మానవులందరు " ఆనంద పడి రక్షణాధారములైన బావులలోనుండి నీళ్లు చేదుకొనాలి" (యెషయా 12:3; తీతు 2:11).

**VI. చివరి హెచ్చరిక : (22:18-19).**

మానవుడు ఈ గ్రంథముతో యేదీ కలుపకూడదు.

"ఆయన మాటలతో ఏమియు చేర్చకుము, ఆయన నిన్ను గద్దించు నేమో, అప్పుడు నీవు అబద్ధికుడ వగుదువు" (సామె 30:6). మనము లేఖనములనతిక్రమింప కూడదని పౌలు చెప్పాడు (1కొరింథీ 4:6).

దేవుని గ్రంథముతో ఏదైనా కలిపిన యెడల ఈ గ్రంథములో వ్రాయబడిన తెగుళ్లు దేవుడు వానికి కలుగజేయును. ఇంకోమాటలో వాడు తన ఆత్మను నరకములోనికి తీసికొనిపోవును.

ఈ గ్రంథము నుండి యేదీ తీసివేయ కూడదు.

"నేను మీకాజ్ఞాపించిన మాటలో దేనిని కలుప కూడదు, దానిలోనుండి దేనిని తీసివేయ కూడదని" దేవుడు అలనాడెప్పుడో మోషే ద్వారా ఆజ్ఞాపించారు (ద్వితీ 4:2). ఆ మాటలు అప్పుడు ఇప్పుడు సత్యమే.

మనం వేరొక సువార్తను ప్రకటింప కూడదు, అట్టివారు శాపగ్రస్తులు (గలతీ 1:6-9).

బైబిలుకు మనం కలుపలేము, దానినుండి తీసివేయలేము. దానిని అభివృద్ధి చేయ లేము ఏలయనగా "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవా వేశము వలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమైయున్నది" (2 తిమోతి 3:16-17).

మనుష్యుడు రొట్టెవలన మాత్రమేకాక దేవుని నోటనుండి వచ్చు ప్రతిమాట వలన జీవించును (మత్తయి 4:4).

మన జీవముకు భక్తికి కావలసిన వన్నిటిని ఆయన గ్రంథము మనకు దయచేయుచున్నది (2 పేతురు 1:3). దానిని అభివృద్ధి చేయలేము అది దేవుని వాక్యము.

దేవుని గ్రంథములోని వాక్యములను తారుమారు చేయు వానికి జీవవృక్షము

లోను పరిశుద్ధ పట్టణములోను పాలు లేకుండా పోవును నిత్యనరకానికి పోవును. ప్రకటన గ్రంధాన్ని యోహాను ప్రార్ధనతో ముగించాడు: "ప్రభువైన యేసూ రమ్ము" (20వ). నీవు కూడ ఆ ప్రార్ధన చేయగలవా? ఆయన రాకడకొరకై ప్రార్ధించుచున్నావా ? ఆయన రాకడ కొరకు సిద్ధపడియున్నావా? ఆయనను మనం అంతగా ప్రేమించుచున్నామా? "ప్రభువైన యేసు కృప పరిశుద్ధుల కందరికి తోడైయుండునుగాక!". ఆమేన్ !! (21వ).

సమాప్తము !!

## గమనిక

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న
సత్యవాణి T.V కార్యక్రమములను
దిగువ సమయాల్లో తప్పక చూడండి

ప్రతి ఆదివారం ఉదయం 6.30 గం॥కు రక్షణ ఛానల్
ప్రతి ఆదివారం సాయంత్రం 6:00 గం॥కు శుభవార్త ఛానల్
ప్రతి సోమవారం ఉదయం 6.00 గంటలకు శుభవార్త ఛానల్‌లో
ప్రతి బుధవారం ఉదయం 7:00 గంటలకు విస్సా ఛానల్‌లో
ప్రతి శనివారం ఉదయం 6.30 గం॥లకు రక్షణ ఛానల్

బైబిలు సర్వే :

# క్రొత్తనిబంధనలో - మారుమనస్సుపొందినవారు

అపోస్తలుల కార్యముల గ్రంధము అనగా మార్పుచెందిన వారిని గూర్చిన గ్రంధము. దానియందు 9 చోట్ల ప్రజలు ఎలా క్రైస్తవులయ్యారో వ్రాయబడింది. మార్పుచెందుటయనగా ప్రభువైపు తిరుగుటయని అర్ధము. మారుమనస్సు పొందినవారు లోకమునుండి తిరిగి ప్రభువైపు వచ్చుట. ప్రస్తుతము లోకమునందున్నవారు అపోస్తలుల విధానాన్ని అంగీకరించుటలేదు. మనం మాత్రం మొదటి శతాబ్దములో ప్రజలు ఎలా మారుమనస్సు పొంది ప్రభువైపు తిరిగారో పరిశీలించి చూడాలి కానీ మనం చెప్పేది చేసేది రైటని అనుకోరాదు.

**దేవుని కృపను అంగీకరించుట :**

ఇంత క్రితం మనల్ని రక్షించుటలో దేవుని పాత్రను గూర్చి చదువుకున్నాము. మానవులను రక్షించుటలో ఆయన తన కుమారుని సిలువమీద బలియర్పించి మానవుల పాపములకు ప్రాయశ్చిత్తము కావించి తన ప్రేమను కృపను బయలు పరచాడు. ఈ పాపక్షమాపణ పొందాలంటే క్రీస్తు కోరేదేమంటే మనం ఆయనకు విధేయులవ్వాలని " మరియూ అయన సంపూర్ణ సిద్ధిపొందినవడై తనకు (క్రీస్తుకు) విధేయులైనవారి కందరికిని నిత్యరక్షణకు కారకుడాయెను" (హెబ్రి 5:9). కేవలం విధేయులేకాకుండ సరియైన విధానమును అనుసరించుట ద్వారా దేవుడనుగ్రహించు నిత్య రక్షణ పొందగలము.

ఉదహారణకు మునిగిపోతున్న వ్యక్తికి ఒకడు తాడు వేసి దానిని పట్టుకో అని అజ్ఞాపించాడు. నీవు పట్టుకుంటే నేను నిన్ను తాడును లాగుటద్వారా రక్షిస్తాను అని అన్నాడు. నిజంగా నీటిలో పడ్డవాడు తన ప్రాణం రక్షించుకోవాలనుకుంటే తాడు వేసినవానికి విధేయత చూపించాలి. తాడు పట్టుకొని ఈ ప్రాణ రక్షణ పొంది తానే తన రక్షణ సాధించానటంలో అర్ధంలేదు. అట్లానే మనం సువార్తకు విధేయత చూపుట యనునది దేవుని కృపను పొందుటకు దారిచూపుచున్నది.

**మారుమనస్సు పొందిన వారి ఉదాహరణలు :**

అపోస్తులుల కార్యములలో మారుమనస్సు పొందినవారిని గూర్చి చదువుచున్నప్పుడు మనం క్రైస్తవులగుటకు దేవుడు ఏమిచేయాలని కోరుచున్నాడో అర్ధమగుచున్నది. ఈ 9 సందర్భములన్నియూ కలిపి చూచిన

ప్పుడు రక్షణ పొందుటకు వారందరూ ఏమి చేశారో అర్థమవుతుంది.

1. పెంతెకోస్తు దినమున 3000 మంది (అ.కా. 2) : ఆ జనసమూహమున్నంతటికీ పేతురు చెప్పే దేమిటంటే –"మీరు రూఢిగా తెలుసుకోండి " అదేమిటంటే "మీరు సిలువవేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగానూ క్రీస్తుగానూ నియమిం చెను" (అ.కా. 2:36). వారు నమ్మి "సహోదరులారా మేమేమి చేతుమని " అడిగారు (అకా. 2:37). అందుకు పేతురు –మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తీస్మము పొందుడి. అప్పుడు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు (అ.కా. 2:38). ఆదినమందు 3000 మంది విశ్వసించి మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తీస్మము పొందారు.

2. సమరయుల్యులు (అకా. 8): సువార్తికుడైన ఫిలిప్పు దేవుని వాక్యమును ప్రకటించుటకు సమరయ వెళ్ళాడు. "జనసమూహములు విని ఫిలిప్పు చేసిన సూచకక్రియలను చూచినందున అతడు చెప్పిన మాటలయందు ఏకమనస్సుతో లక్ష్యముంచగా" (అ.కా. 8:6). "అయితే ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చియు యేసు క్రీస్తు నామమును గూర్చియు సువార్త ప్రకటించుచుండగా వారతనిని నమ్మి పురుషులును స్త్రీలును బాప్తీస్మము పొందిరి" (అకా. 8:12).

3. ఇతియోపియా నపుంసకుడు (అ.కా. 8): "ఫిలిప్పు రథములో వెళ్ళుచున్న నపుంసకుని కలుసుకొనెను. ఇతడు క్రీస్తునందు విశ్వాసముంచాడు. ఆయన విశ్వాసాన్ని ప్రకటించాడు. నీళ్ళున్న ఒకచోటికి వచ్చినప్పుడు వారు రథమును అపుచేసి వారు నీళ్లలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు నపుంసకునికి బాప్తీస్మ మిచ్చెను" (అ.కా. 8:38).

4. తార్సువాడైన సౌలు (అ.కా. 9:22,26): ఈతని మార్పుచెం దిన వృత్తాంతము నంతటినీ తెలుసుకొ నుటకు ఈ మూడు అధ్యాయములను చదవాలి. దమస్కునకు వెళ్ళుచుండగా ఆకాశము నుండి ప్రకాశమానమైన వెలుగును చూచి అతడు నేలక్రిందపడి చూపు లేకుండా పోయెను. "లేచి పట్టణములోనికి వెళ్ళుము. అచ్చట నీవు ఏమిచేయవల యునో అది నీకు తెలుపబడునని" క్రీస్తు అతనికి చెప్పెను (అ.కా. 9:6). అననీయ అతని దగ్గరకు వచ్చి యీలాగు ఆజ్ఞాపించాడు. "గనుక నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమునుబట్టి ప్రార్థనచేసి బాప్తీస్మము పొంది నీ పాపములను కడిగివేసుకొనుము" (అ.కా. 22:16).

సౌలు బాప్తీస్మం పొందాడు. అతని పాపములు కడిగివేయబడ్డాయి. మనం ఇచ్చట గ్రహించవలసిన సంగతి ఏమిటంటే సౌలు దమస్కుకు వెళ్ళేటప్పుడు రక్షింపబడలేదు. ఒక వేళ అతని పాపాలు క్షమించబడివుంటే అననీయ వచ్చి పాపక్షమాపణ నిమిత్తము బాప్తీస్మం పొందాలని చెప్పియుండేవాడు కాడు.

5. కొర్నేలి (అ.కా. 10,11): ఈయన అన్యజనాంగమునుండి రక్షించబడిన మొట్టమొదటి వ్యక్తి, రోమా సైన్యాధికారి ప్రభువుచేత స్వయంగా పేతురుకోసం కబురుపంపమని చెప్పబడ్డాడు. "నీవునూ నీయింటి వారునూ ఏమాటలవలన రక్షణపొందుదురో ఆమాటలు అతడు నీతో చెప్పును" (అ.కా. 11:14). పేతురు కొర్నేలికి అతని స్నేహితులకు క్రీస్తును గూర్చి ప్రకటించెను. "ఆయన నామమందు విశ్వాసముంచువాడెవడో వాడు ఆయన నామముమూలముగా పాపక్షమాపణ పొందునని ప్రవక్తలందరూ ఆయనను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నారు" (అ.కా. 10:43). వారు విశ్వసించి బాప్తీస్మము పొందిరి (అ.కా. 10:47).

6. లూదియ (అ.కా. 16): ఫిలిప్పీలో పౌలు యీస్త్రీకి బోధించాడు. ఈమె గూర్చి యిలావుంది : " అప్పుడు లూదియా అను దైవభక్తిగల స్త్రీ వినుచుండెను. ఆమె ఊదారంగు పొడిని అమ్ము తుయతైరా పట్టణస్తురాలు. ప్రభువు ఆమె హృదయమును తెరచెను. గనుక పౌలు చెప్పిన మాటలయందు లక్ష్యముంచెను. ఆమెయుఆమె యింటి వారునూ బాప్తిస్మము పొందినప్పుడు ...... (అ.కా. 16:14,15). లూదియా విని విశ్వసించి బాప్తీస్మము పొందింది.

7. ఫిలిప్పీ జైలరు (అ.కా. 16). : ఫిలిప్పీలో పౌలు శీల జైలులో వేయబడ్డప్పుడు ఆజైలుఅధికారిని కూడాను మార్చగలిగారు. జైలు అధికారి వీరు దైవజనులనితెలుసుకొని యీలాగన్నాడు- "అయ్యాలారా రక్షణపొందుటకు నేనేమిచేయాలి? (అకా. 16:30). అందుకు వారు ప్రభువైన యేసునందు విశ్వాసముం చుము. అప్పుడు నీవునూ నీ యింటి వారునూ రక్షణపొందుదురనెను" (అ.కా. 16:31). రాత్రి ఆ గడియలోనే అతడు వారిని తీసుకొనివచ్చి వారి గాయములు కడిగెను. వెంటనే అతడునూ అతని యింటివారందరునూ బాప్తీస్మము పొందిరి (అ.కా. 16:33). దేవునియందు విశ్వాసముంచినవాడై తన యింటివారందరితో ఆనందించెను(అ.కా. 16:34).

8. కొరింథీయులు అ.కా. 18) : కొరింధువారు పౌలుచే బోధించబడ్డారు.

"కొరింథీయులలో అనేకులు విని, విశ్వసించి బాప్తీస్మము పొందిరి" (అ.కా. 18:6).

9. ఎఫెసువారు (అ.కా. 19). బాప్తీస్మమిచ్చు యోహాను శిష్యులలో 12 మందిని పౌలు ఇచ్చట మార్చెను. వారితో పౌలు యీ విధముగా అన్నాడు- " యోహాను తన వెనుకవచ్చువారియందు అనగా యేసునందు విశ్వాసముంచవలెనని ప్రజలతో చెప్పుచూ, మారు మనస్సు విషయమైన బాప్తీస్మమిచ్చెనని చెప్పెను. వారు ఆ మాటలు విని ప్రభువైన యేసునామమున బాప్తీస్మము పొందిరి (అ.కా. 19:4-5).

# ఒక నొకా సమయమందు

## (Once upon a time)

క్రీస్తు పూర్వము 1000 సం॥రముల క్రితము దేవుని చిత్తాను సారమైన మనస్సు కలిగి యున్న యొక వీరుని గూర్చిన కథ యిది . తన తండ్రి యైన యెష్షయి ఆ వీరునికి దావీదు (అనగా మిక్కిలి ప్రియమైన ) అను పేరు పెట్టెను. యెష్షయి యొక్క సంతానములో దావీదు ఎనిమిదవ వాడు. ఆఖరిసంతానమగు ఈ దావీదు యొక్క జీవితమును గూర్చి తన జీవితములో అతడు జరిగించిన కార్యములను గూర్చి 1,2, సమూయేలు, 1 రాజులు, 1 దినవృత్తాంతముల గ్రంధములలో బైబిలునందు మనము చదువ గలము. బైబిలు గ్రంధములో మరియే యితర వ్యక్తిని గూర్చి కూడ యింత వివరముగ వ్రాయబడి యుండలేదు. బెత్లెహేమీయుడైన ఈ బాలుడు అందమైన రూపముగలవాడు. అతడు ఎఱ్ఱని వాడును, చక్కని నేత్రములు గలవాడును, చూచుటకు సుందరమైన వాడునై యుండెను. (1సమూయేలు 16:12) . అయితే దేవుడు అతని హృదయమును లక్ష్య పెట్టినందు వలన సౌలు రాజు తరువాత ఇశ్రాయేలీయులకు రాజుగా అతనిని అభిషేకించెను. ఆతడు మంచి శరీరదారుఢ్యము కలిగి యుండుటయే గాక,విశ్వాసమందు కూడ చాల స్థిర చిత్తుడుగ యుండెను. విశ్వాసమును బట్టి మహాశూరుడగు గొల్యాతును వడిసెల రాతితో చంపెను. అందుకు దావీదు సౌలుతో ఇట్లనెను. "మీ దాసుడనైన నేను నాతండ్రి యొక్క గొఱ్ఱెలను కాయుచుండగ సింహమును, ఎలుగుబంటియు వచ్చి, మందలో నుండి యొక గొఱ్ఱె పిల్లను ఎత్తికొనిపోవుచుండగ, నేను దానిని తరిమి చంపి దాని నోటనుండి ఆగొఱ్ఱెను విడిపించితిని, అది నామీదికి

రాగా దాని గడ్డము పట్టుకొని దాని కొట్టి చంపితిని" (1 సమూయేలు 17:34-35). గొప్ప యోధుడైన దావీదు ఇశ్రాయేలీయులను 40 సం॥రములు పరిపాలించెను.

ఇశ్రాయేలీయుల మధుర గాయకుడైన దావీదు కీర్తనల గ్రంథములోని డెబ్బది మూడు కీర్తనలను రచించెను. యెహోవా నిబంధన మందసము దావీదు పురములోనికి రాగా ఆనందముతో దావీదు మందసము ముందు నాట్యమాడు చుండెను. యెహోవా నిబంధన మందసము దావీదు పురము లోనికి రాగా సౌలు కుమార్తె యైన మీకాలు కిటికీలో నుండి చూచి రాజైన దావీదు నాట్యమాడుటయు, వాయించుటయు కనుగొని తనమనస్సులో అతని హీనపరచెను (1 దినవృత్తాంతములు 15:29). దావీదు సౌలు రాజునకు భయపడినందున అచ్చటినుండి పారిపోయి గాతు దేశమునకు చేరెను. గాతు రాజు సేవకులు దావీదును గుర్తించుట ద్వారా ఆ దేశపు రాజునకు భయపడి నందు వలన వారి యెదుట తన చర్య మార్చు, కొని వెర్రివానివలె నటించుచు, ద్వారపు తలుపుల మీద గీతలు గీయుచు, ఉమ్మి తన గడ్డము మీదకు జారనిచ్చుచుండెను. (1 సమూయేలు 21:13). దావీదు మంచి నటుడు కూడాను.

రాజైన దావీదు చాల ప్రేమ గల వ్యక్తి .. సౌలు రాజు యొక్క ఆగ్రహము నుండి తన్ను రక్షించు కొనుటకుగాను మోయాబు దేశమునకు పారిపోయి ఆదేశపు రాజు చెంతకు వెళ్లి దేవుడు నాకు యేమి చేయునది నేను తెలిసికొను వరకు నాతల్లిదండ్రులు వచ్చి, నీ యొద్ద నుండ నిమ్మని ఆ రాజుతో మనవి చేసికొని, అతని యొద్దకు వారిని తోడు కొని పోయెను. (1 సమూయేలు 22:3). అతడు మంచి ప్రేమ గల భర్తకూడాను. దావీదు,బత్షెబల యొక్క ప్రథమ సంతానమైన బిడ్డచనిపోయిన ప్పుడు తన భార్యాయైన బత్షెబను దావీదు ఓదార్చెను (2. సమూయేలు 12 :24). అతడు ప్రేమ గలిగిన తండ్రి. అబ్షాలోము తన సహోదరుడైన అమ్నోనును చంపి పారిపోయినపుడు తన కుమారుడైన అమ్నోను కొరకు దావీదు ప్రతి దినము అంగలార్చు చుండెను. (2సమూయేలు 13:37). తనపై తిరుగుబాటు చేసిన తన కుమారుడైన అబ్షాలోము మృతి చెందినపుడు కూడ అతడు ఎంతగానో దుఃఖించెను. (2.సమూ 18:33). దావీదు యోనాతాను యొక్క ప్రియమైన స్నేహితుడు. యోనాతాను కుమారుడైన మెఫీబోషెతును కనుగొని వానిని యెరూషలేమునకు తీసికొని వచ్చి సదాకాలము రాజు బల్ల యొద్ద

భోజనము చేయుటకు యేర్పాటు చేసెను. అతని కాళ్లు రెండును కుంటివి (2 సమూ 9:13).

దావీదు మంచి శిల్పకళా నైపుణ్యత గలవాడు. యెరూషలేములో దేవుని మందిరమును అతని కుమారుడు కట్టించి నప్పటికిని దాని రూపకల్పన యంతటిని తెలియజేసినవాడు దావీదే. "అప్పుడు దావీదు మంటపమునకును, మందిరపు కట్టడమునకును, బొక్కసపుశాలలకును, ప్రతిష్టత వస్తువుల బొక్కసములకును, తాను యేర్పాటు చేసి సిద్ధపరచిన మచ్చులను తన కుమారుడైన సొలోమోనునకు అప్పగించెను" (1దినవృత్తాంతములు 28:11-13). మరియు యాజకులును లేవీయులును సేవోపకరణముల పట్టీయును, యెహోవా మందిరపు సేవను గూర్చిన పట్టీయును దావీదు అతనికప్పగించెను. ప్రశస్త వస్తువులన్నిటిని యెహోవా మందిరము కొరకు అతడు సేకరించెను. "నేను బహుగా ప్రయాసపడి నాదేవుని మందిరమునకు కావలసిన బంగారపు పనికి బంగారమును, వెండి పనికి వెండిని, ఇత్తడి పనికి ఇత్తడిని, ఇనుప పనికి ఇనుమును, కఱ్ఱ పనికి కఱ్ఱలను, గోమేధికపురాళ్లను, చెక్కుడు రాళ్లను, వింతైన వర్ణములుగల పలు విధము లైనరాళ్లను, మిక్కిలి వెలగల నానావిధ రత్నములను, తెల్లచలువ రాయిని విశేషముగా సంపాదించితిని" (1దినవృత్తాంతము 29:2).

మన వీరుడు చాల అసమాన్యమైన వ్యక్తిగా ఈభూమి మీద జీవించెను. దావీదు ఒక యుద్ధమందు ఒక వడిసెల ఒక రాతితో జయమును పొందెను. "అప్పుడు యెహోవా కత్తిచేతను, ఈటెచేతను రక్షించు వాడు కాడని ఈ దండు వారందరు తెలిసి కొందురు, యుద్ధము యెహోవాదే; ఆయన మిమ్మును మాచేతికి అప్పగించును" (1సమూ 17:47). యెహోవా చేత అభిషేకము నొందిన రాజైన సౌలు రెండు సార్లు తన చేతికి చిక్కినను అతనిని చంపుటకు నిరాకరించెను. శత్రువు చేతికి చిక్కినట్లయిన ఏమనుష్యుడైన అతనికి హాని చేయకుండ విడిచిపెట్టునా? (1సమూ 24:10,19). తనకు పుట్టిన బిడ్డ రోగియై యుండినపుడు ఉపవాసములో నేలపై పడి యుండి దేవునిని బ్రతిమాలుకొని బిడ్డ చనిపోయెనని తెలుసుకొని నేలనుండి లేచి స్నానము చేసి, తైలము పూసికొని వేరు వస్త్రములు ధరించి యెహోవా మందిరములో ప్రవేశించి మ్రొక్కి తన యింటికి తిరిగి వచ్చి భోజనము తెమ్మనగా వారు వడ్డించిరి. అప్పుడు అతడు భోజనము చేసెను (2 సమూయేలు 2:15-23). ఈ విధముగ

చేయుట ద్వారా దావీదు తన సేవకులకందరికి ఎంతో ఆశ్చర్యమును కలిగించెను. తన కుమారుడైన అబ్షాలోము దావీదు పై తిరుగుబాటు చేసిన సమయములో దావీదు బయటికు పోవుచున్నపుడు షిమీ అనునతడు దావీదు వెంటనడచుచు, దావీదును శపించుచు దావీదు మీదను అతని సేవకులందరి మీదను రాళ్లు రువ్వుచుండినను దావీదు షిమీని స్వేచ్ఛగ విడిచిపెట్టెను (2 సమూయేలు 16:11-14). దావీదు యొక్క మరి యొక అసాధారణమైన వ్యక్తిత్వమేమనగా ముగ్గురు యోధులైన సైనికులు ఫిలిష్తీయుల దండులోనికి చొరబడి పోయి బెత్లెహేము ఊరి గవిని యొద్ద బావి నీళ్లు చేదుకొని దావీదు కొరకు తీసుకునిరాగా దావీదుకు ఆనీళ్లు త్రాగుటకు మనసు లేక యెహోవాకు అర్పితముగ వాటిని పారబోసెను (2 సమూయేలు 23:16, 1 దినవృత్తాంతములు 11:17-19). తెగులు మనుష్యులకు తగులకుండ నిలిచిపోవునట్లు దావీదు యెహోవా బలిపీఠమును కట్టి బలుల అర్పించుటకు సమాయత్తమగుచుండగ అరౌనా బలిపీఠమునకు స్థలమును, దహన బలులు అర్పించుటకు ఎడ్లును, నూర్చుటకు కఱ్ఱ సామానులును దావీదునకు యిచ్చుటకు మనస్కరింపగా, రాజు - నేనాలగు తీసికొనను. వెలయిచ్చిన యొద్ద కొందును, వెల ఇయ్యక నేను తీసికొనిన దానిని నా దేవుడైన యెహోవాకు అర్పించనని చెప్పి ఆ కళ్లమును, ఎడ్లను ఏబది తులముల వెండికి కొనెను (2 సమూ 24:24). దావీదు హిత్తీయుడైన ఊరియా సంగతి యందు తప్ప తన జీవిత దినములన్నియు యెహోవా దృష్టికి యథార్థముగ నడచుకొనుచు, యెహోవా అతనికిచ్చిన ఆజ్ఞలలో దేని విషయమందును తప్పిపోకుండెను (1 రాజులు 15:4).

దేవుని చిత్తాను సారమైన మనస్సుగల ఈ మనుష్యుని దేవుడు బహుగా ఆశీర్వదించెను. అతడు ఇశ్రాయేలీయులను నలుబది సంవత్సరములు పరిపాలించెను. నీ మట్టుకు నీ సంతానమును, నీ రాజ్యమును నిత్యము స్థిరమగును. నీ సింహాసనము నిత్యము స్థిరపరచబడును అని యెహోవా దేవుడు దావీదునకు తెలియజేసెను (2 సమూ 7:16). యెహోవా దావీదును బహుగా వృద్ధిపొందించి అతనిని ఒక కొల్ల మానికగ చేసెను. అతని వంశీయులు ఒకరి తరువాత మరియొకరు యూదాను పరిపాలించిరి.

దావీదు వంశములో నుండియే మన ప్రభువైన యేసు క్రీస్తు జన్మించెను. క్రీస్తు పూర్వము 700 సంవత్సరములు

క్రితమే ప్రవక్తయైన యెషయా ఈ విధముగ ప్రవచించెను. అదే మనిన , "ఏలయనగా మనకు శిశువు పుట్టెను. మనకు కుమారుడు అనుగ్రహింపబడెను. ఆయన భుజము మీద రాజ్యభారముం డును. ఆశ్చర్యకరుడు, ఆలోచన కర్త, బలవంతుడైన దేవుడు. నిత్యుడగు తండ్రి, సమాధాన కర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును" (యెషయా 9:6)." ఇది మొదలుకొని మితి లేకుండ దానకి వృద్ధియు , క్షేమము కలుగునట్లు సర్వకాలము దావీదు సింహాసనమును, రాజ్యమును నియమించును. న్యాయము వలనను నీతి వలనను రాజ్యమును స్థిరపరచుటకు అతడు సింహాసనా సీనుడై రాజ్యపరిపాలన చేయును. సైన్యములకు అధిపతియగు యెహోవా ఆసక్తి కలిగి దీనిని నెరవేర్చును" (యెషయా 9:6-7). యేసు ప్రభువు పుట్టక ముందు దూత ఈ విధంగ తెలియపరచెను. "ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబ డును. ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయనకిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును, ఆయన రాజ్యము అంతము లేనిదై యుండును అని చెప్పెను" (లూకా 1:32-33). మన ప్రభువైన యేసు రాజాధిరాజుగ ఆయన దావీదు సింహాసనమునధిష్టించి రాజ్యపరిపాలన చేయుచున్నారు. నేను దావీదు వేరు చిగురును, సంతానమును, ప్రకాశమానమైన వేకువ చుక్కయునై యున్నాను (ప్రకటన 22:16) అని మన ప్రభువైన యేసు చెప్పుచున్నారు. నేను జయించి నా తండ్రితో కూడ ఆయన నా సింహాసనమందు కూర్చుండి యున్న ప్రకారము జయించు వానిని నాతోకూడ నా సింహాసనమందు కూర్చుండ నిచ్చెదను అని ఆయన వాగ్దానము చేయుచున్నారు (ప్రకట 3:21). మరణము వరకు నమ్మకముగ యుండుము - నేను నీకు జీవకిరీటమిచ్చెదను. (ప్రక 2:10). మంచి పోరాటము పోరాడితిని. నా పరుగుకడ ముట్టించితిని. విశ్వాసము కాపాడు కొంటిని ఇక మీదట నాకొరకు నీతికిరీట ముంచ బడియున్నది (2 తిమోతి 4:7).

దావీదు సింహాసనముపై అధిష్టించియున్న మన ప్రభువైన యేసు క్రీస్తు చెంతయుండుటకు, నీవు జీవకిరీటమును, స్థలమును సంపాదించు కొనుటకు నీవు సిద్ధపడుచుంటివా ? .

- కబిత గూటం

# క్రీస్తులో క్షమాపణ

క్షమాపణ అనగా ఒకని అపరాధములను తుడిచివేయుట, కేన్సల్‌చేయుట, పూర్తిగా క్షమించుటయని అర్థము (కీర్తన 32:12; మత్తయి 9:2; లూకా 7:48). పాపక్షమాపణను గూర్చి చెప్పుకొన్నప్పుడు "మా పాపములను మామీద మోపవద్దు" అని సంఖ్యా 12:11లో యున్న మాటను కూడ గుర్తుంచుకోవాలి.

అవిదేయులైన మానవులు దేవుని ఆజ్ఞలను ఉల్లంఘించుట ద్వారా తమకొరకు సృష్టించుకొనిన దుఃఖ పరిస్థితిని దేవుడు అంతమొందించుట క్షమాపణయని చెప్పవచ్చును. మానవుని పాపము దేవునికి తీవ్ర అభ్యంతరముగాను , మానవునికి హానికరముగాను యుండును. పరిశుద్ధ దేవునికి, మానవునికి మధ్యనున్న నిజసంబంధాన్ని పాపము చెడగొట్టును. మానవుడు తనకుగాతాను పాపనివృత్తి కొరకు యేమీచేయలేడు. అందువలన ఇక్కడ దేవుడు తన సార్వభౌమత్వముతో పనిచేయును. తన దీర్ఘశాంతము వలనను కరుణవలనను తన తీర్పును అమలు చేయక మానవునికి ఉపశమనము కలుగజేయును.

నిర్హేతుకముగా అనుగ్రహించబడు క్షమాపణను గూర్చి క్రొత్త నిబంధన వక్కాణించుచున్నది. మత్తయి 18:23-25లో దేవుని క్షమాపణ మనకు వర్ణించబడినది.

పాపసహిత మానవులు దేవునియెదుట నిలబడలేరు. తమ్మును తాము రక్షించుకొన లేరు. "అందుకువారు అత్యధికముగా ఆశ్చర్యపడి - అట్లయితే ఎవడు రక్షణ పొందగలడని ఆయననడిగిరి. యేసువారిని చూచి - ఇది మనుష్యులకు అసాధ్యమేగాని దేవునికి అసాధ్యముకాదు; దేవునికి సమస్తమును సాధ్యమే అనెను" (మార్కు 10:26-27).

దేవుడు మానవుని ప్రేమించుచున్నారు. ఆయన కృప చొప్పున అనుగ్రహింపబడిన రక్షణ షరతులకు లోబడు ప్రతివానిని ఆయన రక్షింపగోరుచున్నారు. "నీ పాపములు క్షమింపబడియున్నవి" (మార్కు 2:5). విశ్వాసము, మారు మనస్సు, ఒప్పుకోలు, బాప్తిస్మము అనురక్షణ షరతులకు లోబడువానికి పాపములక్షమాపణ సువార్తయై యున్నది (అపొ.కా. 2:38, రోమా 6:1-10). మానవుడు తండ్రి యింటికి తిరిగి వస్తాడని దేవుడు ఎదురు చూచుచున్నారు (లూకా 15:11-32). మానవుడు అనర్హుడే అయినను దేవుని యొక్క దయవలన అతడు తండ్రియొద్దకు తిరిగివచ్చుట సాధ్యమగును.

దేవుని కుమారుడైన యేసుక్రీస్తు లేకుండా పాపక్షమాపణ, మానవుని పునరుద్ధరణ అసంభవము. పాపములు క్షమించు అధికారము క్రీస్తు ఒక్కరే కలిగియున్నారు. "మనుష్య కుమారుడు పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెనని" యేసు చెప్పెను (మార్కు 10:45).

క్రీస్తు సంఘమును పరిశీలించుచుండగా, పాపముల క్షమాపణ క్రీస్తుకు, క్రైస్తవ జీవితమునకు సంబంధించియున్నది. ఈ కృప బాప్తిస్మములో విశదమగుచున్నది. "మీరు మారు మనస్సుపొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తునామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మయను వరము పొందుదురు"(అపొ.కా. 2:38). లూకా 24:47; రోమా 6:1-10ని కూడ చదువుము.

తమ యెడల అపరాధము జరిగించిన వారిని క్రైస్తవులు తప్పక క్షమించాలి. యితరుల అపరాధములు క్షమించకుండా దేవునికి ఇష్టుడై క్రైస్తవుడు జీవించుట అసాధ్యము (మత్త6:12-14; 18:21-35; మార్కు 11:25).

"ఆ కుమారునియందు మనకు విమోచనము, అనగా పాప క్షమాపణ కలుగుచున్నది" (కొలస్స 1:14). దేవుని కృపామహోదైశ్వర్యమునుబట్టి ఆప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది" (ఎఫెసీ 1:7)

- హేన్స్ డెదెర్‌షెక్

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2009-2011

To

From:

**SATYA VAKKU**

**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gollam Printed by him at Satya Vani Publication, Sambhamurthy [illegible] Kakinada - 533 00[illegible]